APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 17, జూలై 2026 సంపుటి: 01 సంచిక :50 పేజీలు : 04 వెల: 2-00/-




## బొగ్గు రంగంపై సమీక్ష

- ఉత్పత్తి పెంపుపై దృష్టి
- ఇంధన భద్రతకు వ్యూహాలు
- కేంద్ర మంత్రి కీలక సమావేశం

న్యూఢిల్లీ, జూలై 16 : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి న్యూఢిల్లీలో బొగ్గు రంగ పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి సతీశ్ దూబే, బొగ్గు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో కలిసి బొగ్గు ఉత్పత్తి, సరఫరా, కీలక కార్యక్రమాల అమలును సమీక్షించారు. సమావేశంలో దేశవ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా, పంపిణీ వ్యవస్థల పురోగతిపై అధికారులు మంత్రికి వివరించారు. బొగ్గు రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరును సమీక్షించి, లక్ష్యాల సాధనపై దృష్టి సారించారు. బొగ్గు గనుల్లో కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని విస్తరించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. స్థిరమైన, విశ్వసనీయ ఇంధన సరఫరా కోసం దీర్ఘకాలిక ప్రణాళికలను వేగవంతం చేయాలని సూచించారు. బొగ్గు రంగంలో కొనసాగుతున్న కీలక కార్యక్రమాల అమలు, ఉత్పత్తి లక్ష్యాలు, సరఫరా వ్యవస్థల సామర్థ్యంపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

## పోలవరం పురోగతిపై మంత్రి సమీక్ష

- గండి పోశమ్మకు ప్రత్యేక పూజలు
- జలవిద్యుత్ పనుల పరిశీలన
- సాగునీటి లక్ష్యంతో ముందుకు

పోలవరం, జూలై 16 : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్రలో భాగంగా పోలవరం జిల్లా గొండూరు గ్రామంలోని శ్రీ గండి పోశమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు సకాలంలో పూర్తై రాష్ట్ర రైతాంగానికి సమృద్ధిగా సాగునీరు అందాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తై ఆంధ్రప్రదేశ్ సస్యశ్యామలంగా మారాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రాజెక్టు పూర్తయితే రైతులకు సాగునీరు అందడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. అనంతరం పోలవరం జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఒక్కోటి 80 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న 12 జలవిద్యుత్ ఉత్పత్తి యూనిట్ల పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు



చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి లాంటిదని, సాగునీటి అవసరాలతో పాటు విద్యుత్ ఉత్పత్తిలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు కొనసాగుతాయని తెలిపారు.



## ట్రాఫిక్ భద్రతపై సమీక్ష

- అమలు చర్యలు మరింత కట్టుదిట్టం
- ప్రమాదాల నివారణకు కీలక ఆదేశాలు
- ఈ-చలాన్లు, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, జూలై 16 : సైబరాబాద్ ట్రాఫిక్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రత, అమలు చర్యల పురోగతిపై జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ అధికారులతో జరిగిన ఈ సమావేశంలో ట్రాఫిక్ అమలు చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఈ-చలాన్ వసూళ్లు, ట్రాఫిక్ నిబంధనల అమలు, వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల పరిస్థితిపై సమీక్షించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు.

## ఖబర్‌స్తాన్ అభివృద్ధి పనులకు శ్రీకారం




- ప్రహరీ గోడను ప్రారంభించిన మంత్రి ఫరూక్
- మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు
- నారా లోకేష్ సహకారంతో అభివృద్ధి పనులు

తాడేపల్లి, జూలై 16 : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లిలో అభివృద్ధి చేసిన జన్నతుల్ బఖీ (ఖబర్‌స్తాన్) ప్రహరీ గోడను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సలహాదారు ఎం.ఏ. షరీఫ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షబ్లీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మైనార్టీ వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రార్థనా స్థలాలు, ఖబర్‌స్తాన్ల అభివృద్ధికి అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.మంత్రి నారా లోకేష్ సహకారంతో తాడేపల్లి ప్రాంతంలో ఖబర్‌స్తాన్ అభివృద్ధి పనులు పూర్తి కావడం స్థానిక ముస్లిం సోదరులకు ఉపయోగకరంగా మారిందన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు. ఖబర్‌స్తాన్ అభివృద్ధితో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడటంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## జగన్ సూపర్ యాప్ ప్రారంభం

- కార్యకర్తల కోసం డిజిటల్ వేదిక
- పార్టీతో నేరుగా అనుసంధానం
- తాడేపల్లిలో అధికారిక ఆవిష్కరణ

తాడేపల్లి, జూలై 16 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ అధికారిక 'జగన్ 2.0 సూపర్ యాప్' ను తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. పార్లమెంటరీ పార్టీ సమావేశం సందర్భంగా ఈ యాప్‌ను ఆవిష్కరిస్తూ, ప్రతి కార్యకర్తను నేరుగా పార్టీ నాయకత్వంతో అనుసంధానించే డిజిటల్ వేదికగా ఇది పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోస్టు చేసే విషయాలను తొలగించడం, వారి గొంతును అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన జగన్, అలాంటి పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా పార్టీ సొంత వేదికను రూపొందించినట్లు చెప్పారు. ఈ యాప్‌లో కార్యకర్తలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడంతో పాటు పార్టీతో నిరంతరం అనుసంధానంగా ఉండవచ్చని పేర్కొన్నారు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ యాప్ లక్ష్యమని జగన్ వివరించారు. ప్రజా సమస్యలు, పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోలీసు వేధింపులు వంటి అంశాలను నేరుగా యాప్ ద్వారా పార్టీ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. పార్టీ సమావేశాలు, విలేకరుల సమావేశాలు, ముఖ్యమైన కార్యక్రమాలు, అధికారిక ప్రకటనలు యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం రూపంలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. భవిష్యత్తులో కార్యకర్తలు ఎదుర్కొనే సమస్యలను యాప్‌లో నమోదు చేస్తే, పార్టీ నాయకత్వం వెంటనే స్పందించే విధంగా దీనిని మరింత అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.ప్రస్తుతం నిర్వహిస్తున్న డిజిటల్ డైరీని కూడా ఈ సూపర్ యాప్‌తో అనుసంధానం చేస్తామని జగన్ తెలిపారు. రాజకీయ వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు కార్యకర్తలు నేరుగా యాప్‌లోనే ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు.

# ఒలింపిక్స్ లక్ష్యంగా సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో బాలికలకు కిక్‌బాక్సింగ్ శిక్షణ





## ఆస్ట్రియా వైస్-వరల్డ్ ఛాంపియన్ డా. డొమినిక్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ

పుట్టపర్తి జూలై 16 అనంత సూర్య:విద్యార్థినులను అంతర్జాతీయ క్రీడా వేదికలకు, ముఖ్యంగా ఒలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో ప్రత్యేక కిక్‌బాక్సింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రియాకు చెందిన వైస్-వరల్డ్ ఛాంపియన్, ప్రముఖ స్పోర్ట్స్ సైంటిస్ట్ డా. డొమినిక్ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కిక్‌బాక్సింగ్ సాంకేతిక నైపుణ్యాలు, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, పోటీ వ్యూహాలు, ఆత్మరక్షణ పద్ధతులు, ప్రపంచ స్థాయి పోటీల్లో రాణించేందుకు అవసరమైన ఆధునిక శిక్షణను అందించనున్నారు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించేందుకు అవసరమైన శాస్త్రీయ శిక్షణా విధానాలను విద్యార్థినులకు పరిచయం చేయనున్నారు. ఈ సందర్భంగా డా. డొమినిక్ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి క్రీడాకారిణులుగా ఎదగాలంటే క్రమశిక్షణ, నిరంతర సాధన, శాస్త్రీయ శిక్షణ ఎంతో అవసరమని అన్నారు. భారతీయ విద్యార్థినుల్లో అపారమైన ప్రతిభ ఉందని, సరైన మార్గదర్శకత్వం లభిస్తే ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ క్రీడా వేదికల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచగలరని పేర్కొన్నారు. సంస్థ యాజమాన్యం మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో రాణించేలా అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ, ఆధునిక మౌలిక వసతులు, నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను తీర్చిదిద్దడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా మహిళా విద్యార్థులు చదువుతున్న ఉన్నత విద్యాసంస్థల్లో సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఒకటిగా నిలవడం గర్వకారణమని, బాలికల విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కిక్‌బాక్సింగ్ శిక్షణా కార్యక్రమంలో విద్యార్థినులతో పాటు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, శారీరక విద్యా విభాగం సిబ్బంది, క్రీడా శిక్షకులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు అంతర్జాతీయ క్రీడా రంగంలో రాణించే దిశగా బలమైన పునాది ఏర్పడుతుందని సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

# శ్రీ సత్యసాయి బెస్త కళ్యాణ మండపానికి రూ.2 లక్షల విరాళం



పుట్టపర్తి, జూలై 16 అనంత సూర్య: పుట్టపర్తిలో నిర్మాణంలో ఉన్న శ్రీ సత్యసాయి బెస్త కళ్యాణ మండపం నిర్మాణానికి పుట్టపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, వారి సతీమణి బెస్త వెంకటలక్ష్మి రూ.2,00,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా బెస్త సంఘం అధ్యక్షుడు జ్యోతి చంద్రశేఖర్‌కు, పుట్టపర్తి టౌన్ అధ్యక్షుడు బెస్త జయసాయికి విరాళం చెక్కును అందించారు. ఈ సందర్భంగా బెస్త సంఘం నాయకులు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి, సంఘ సేవా కార్యక్రమాలకు బెస్త చలపతి కుటుంబం అందిస్తున్న సహకారం ఆదర్శనీయమని కొనియాడారు. కళ్యాణ మండపం నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన చలపతి, వెంకటలక్ష్మి దంపతులకు బెస్త సంఘం కమిటీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం నాయకులు, కమిటీ సభ్యులు, సామాజిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి 5కే రన్ రైడ్‌కు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం





పుట్టపర్తి, జూలై 16 అనంత సూర్య: ఈ నెల 26న పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించనున్న "శ్రీ సత్యసాయి 5 కె రన్ & రైడ్ – – ఎ స్పిరిట్ ఆఫ్ యూనిటీ" కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, తెలిపారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మీనారాయణరావు నాయకత్వంలో జిల్లా అధ్యక్షులు కె. సూర్యనారాయణ మూర్తి, రాష్ట్ర యువజన సమన్వయకర్త సి. గౌతమ్‌తో కూడిన ప్రతినిధి బృందం గురువారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, ఐఏఎస్, జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీవో) పి. సువర్ణలను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి సంబంధించిన అనుమతి పత్రం, అధికారిక ఆహ్వాన పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఐక్యత, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, మానవతా విలువలు, జాతీయ సమైక్యతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో), జిల్లా బీసీ సంక్షేమ అధికారి (డీబీసీడబ్ల్యూఓ)లకు అవసరమైన సూచనలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మీ నారాయణరావు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డీవోలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యంత్రాంగం నుంచి లభించిన సానుకూల స్పందనతో వేలాది మంది యువత ఈ ఉద్యమంలో భాగస్వాములవుతారని, "ఒకే దేశం -- ఒకే హృదయం -- ఒకే ఆత్మ" అనే సందేశం మరింత విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో, అందరి సహకారంతో ఈ కార్యక్రమం ఘనవిజయం సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# రాయలసీమకు లైఫ్‌లైన్ హంద్రీనీవా: వైసీపీ



అనంతపురం, జూలై 16 అనంత సూర్య: రాయలసీమకు అదనపు జలాల సాధనే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం, గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల సాధన కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 19న కూడేరు మండలం చోళసముద్రం వద్ద హంద్రీనీవా పనులను పరిశీలించి రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకుంటామని చెప్పారు. హంద్రీనీవా ద్వారా 6.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టును అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న పనులతో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదని ఆరోపించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ రాయలసీమకు ఎక్కువ నీరు అందాలంటే హంద్రీనీవా సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఈ నెల 19న హంద్రీనీవా కాలువను పరిశీలిస్తామని తెలిపారు.

# తాళం వేసిన ఇంటికి పోలీసుల భరోసా





- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ప్రజల ఆస్తులకు భద్రత
- ధర్మవరంలో విజయవంతంగా అమలు చేస్తున్న సీఐ రెడ్డప్ప

ధర్మవరం, జూలై 16 అనంత సూర్య: ప్రజల ఆస్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ శాఖ అమలు చేస్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ప్రజల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆలోచనతో ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమాన్ని ధర్మవరం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ రెడ్డప్ప తన సిబ్బందితో సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఇంటికి తాళం వేసి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రోజుల పాటు బయటకు వెళ్లే కుటుంబాలు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందిస్తే, ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనలను నివారించడంతో పాటు ప్రజల్లో భద్రతపై విశ్వాసం మరింత పెరుగుతోంది. సాంకేతికతను వినియోగించి ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్ అందించాలన్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ సంకల్పానికి ఎల్‌హెచ్‌ఎంఎస్ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోంది. ఆ లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేస్తూ ధర్మవరం ఒకటవ పట్టణ సీఐ రెడ్డప్ప తన విధి నిర్వహణలో నిబద్ధతను చాటుకుంటున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సందర్భాల్లో పోలీసులకు సమాచారం అందించి ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రజలు పోలీసులతో సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# డెట్రాయిట్‌లో డాక్టర్ వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు



డెట్రాయిట్ (అమెరికా), జూలై 16 అనంత సూర్య: అమెరికాలోని మిషిగన్ రాష్ట్రం డెట్రాయిట్ నగరంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్నారై కోఆర్డినేటర్లు చెంచు రెడ్డి శ్రీనివాస్, చిత్తలూరి శ్రీనివాస్, బర్ల రెడ్డి పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ ఎన్నారై (యూకే) నాయకుడు డాక్టర్ ప్రదీప్ చింత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తా. అవుటల రమణారెడ్డి, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారై ప్రతినిధులు పాల్గొని డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్సీపీ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి జూమ్ ద్వారా పాల్గొని, డాక్టర్ వైఎస్సార్ ప్రజా సంక్షేమ పాలన, రైతులు, పేదల పట్ల ఆయన చూపిన అంకితభావాన్ని స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.



# 19న ఇండస్ హాస్పిటల్ ప్రారంభోత్సవం



అనంతపురం, జూలై 16 అనంత సూర్య : ఆర్థోపెడిక్ కు సంబంధించి అత్యాధునిక సౌకర్యాలతో ఈ నెల 19వ తేదీన అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డు లోని టీవీఎస్ షోరూం పక్కన ఇండస్ హాస్పిటల్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించనుందుకు చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి ఎం.ఎస్ (ఆర్థో), మేనేజింగ్ డైరెక్టర్ స్నేహ రెడ్డి (ఎం.బి.ఏ సీఏఫ్పి) తెలిపారు. ఇండస్ హాస్పిటల్లో గురువారం డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి, స్నేహ రెడ్డి లు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇండస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆర్థోపెడిక్ విభాగాలతో అత్యాధునిక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. ఇతర ఆసుపత్రుల్లో మోకాళ్ళ మార్పిడి చేయడానికి దాదాపు 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఇండస్ ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటుగా ఉండే ధరకు మాత్రమే మోకాలు మార్పిడి ఆపరేషన్ చేస్తామన్నారు. ఇండియాలోనే ప్రముఖ ఆసుపత్రిలో విధులు నిర్వహించిన అనుభవం డాక్టర్ మదన్ కుమార్ రెడ్డికి ఉందన్నారు. ఆర్థోపెడిక్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి శాశ్వత పరిష్కారం అందుతుందన్నారు. డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి భారత దేశంలోనే మోకాలికీళ్లకు అత్యంత ప్రసిద్ధి చెందిన సన్ షైన్ హాస్పిటల్ లో ఫెలోషిప్ పూర్తి చేశారన్నారు. అనంతపురం జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మదన్ కుమార్ రెడ్డి, స్నేహ రెడ్డిలు కోరారు.

## ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరాణి వేధింపుల నుంచి కాపాడండి



**సీఐటీయూ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నేతలతో కలిసి అంగన్వాడీల ఆవేదన**
**సూపర్ వైజర్ ను బదిలీ చేయకపోతే ఆత్మహతలే దిక్కు**
**-అంగన్వాడీ సమస్యలపై జిల్లాలో జాయింట్ కౌన్సిల్ స్టాఫ్ కమిటీ ఏర్పాటు చేయాలి**
**-30,31 వ తేదీలలో జిల్లా స్థాయి కార్యక్రమం**
**-సిటీటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు**

గోరంట్ల,జూలై 16 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలో ఐసీడీఎస్ గ్రేడ్ -2 సూపర్ వైజర్ గా పని చేస్తున్న నాగరాణి వేధింపుల నుంచి తమను కాపాడాలని ఆ మండల అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నేతలతో కలసి బాధిత అంగన్వాడీ వర్కర్లు మీడియాతో మాట్లాడారు. సూపర్ వైజర్ నాగరాణి వేధింపులు, బలవంతపు వసూళ్లు, అక్రమాల గురించి జాయింట్ కలెక్టర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో ఆమె తమపై పగబట్టినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాపై ఎవరెవరు సంతకాలు చేసి ఫిర్యాదు చేశారో వాళ్ల అంతు చూస్తా. .ఉద్యోగాలు ఊడగొడతా, బజారుకీడుస్తా, అంటూ నోటికొచ్చినట్లు హెచ్చరిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. అంగన్వాడీ వర్కర్ గా పనిచేసిన సొంత మండలంలోనే సూపర్ వైజర్ గా నియమించడంతో, సూపర్ వైజర్ తమను ఎలా ఇబ్బంది పెడుతోందో ఆధారాలతో సహా జాయింట్ కలెక్టర్, ఐసీడీఎస్ పీడీకి ఫిర్యాదు చేసిన విషయం మీడియాలో రావడం తో తమపై కక్ష సాధింపు చేస్తోందన్నారు, సీడీపీఓ కూడా నిజానిజాలు తెలుసుకోకుండా సూపర్ వైజర్ కు ఎందుకు అండగా నిలబడాల్సి వస్తుందని ప్రశ్నించారు. సూపర్ వైజర్ పై మరోసారి జాయింట్ కలెక్టర్, ఐసీడీఎస్ పీడీకి ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగుతామని ప్రకటించారు. ఉదయం నుండి రాత్రి వరకు తమను పని పేరుతో,యాప్ ల పేరుతో తీవ్రంగా వేధిస్తోందని, తాము అనారోగ్యాలకు గురవుతూ సంసార బాధ్యతలు కూడా మర్చిపోతూ ఈ ఇబ్బందులు పడుతు న్నామన్నారు,ఆమెను ఇలాగే కొనసాగిస్తే తాము రాజీనామాలు చేస్తామని మావల్ల పనిచేయడం కాదని ఆవేదన వ్యక్తం చేశారు, తమ సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఐసిడిఎస్ పీడీ దృష్టికి తీసుకెళ్తే కొంతమందిని విడగొట్టి ఆమె వైపు తిప్పుకొని బెదిరిస్తూ తెల్ల పేపర్లో సంతకాలు పెట్టించుకున్నారని వారి వారి ద్వారానే సోషల్ మీడియాలో వచ్చేందుకు ప్రయత్నం చేసిందని పత్రికలలో వచ్చిన మరుసటి రోజు సర్ ప్రోగ్రాం లో భాగంగా తాము విధులు నిర్వహిస్తుండగా ఒక్కొక్కరిని నాలుగవ సచివాలయంలోకి పిలిపించి ఏడ్చి రెండు తెల్ల పేపర్లలో సంత కాలు చేయించు కోందని తాము భయపడి పెట్టామన్నారు, తమ సంతకాలు లేకుండా ఇతర సెక్టార్ల లోని ఆయాలతో సంతకాలు పెట్టించి ఒక పత్రికలో తనకు అనుకూలంగా రాయించుకొందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఒకే వ్యక్తిని ఒకే మండలంలో జిల్లా అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు, ఒక అధికారిగా చాలా ఇస్తూ ప్రతి ఒక్కరిని వేధించడం మంచి పద్ధతి కాదన్నారు, దీనిపై పిడి జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు కమల్ బాషా, ఆటో యూనియన్ బాబా, హమాలీ వర్కర్స్ యూనియన్ గంగాధర్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాగజ్యోతి,సువర్ణ,అయేషా భాను, లక్ష్మీ,మంజుల, నాగమణి,పద్మ, ప్రమీల,ఆశా వర్కర్ శబరీ,టీవీఎస్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు..

## ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

- **అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు అమలు చేయాలి**
- **జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశం**

పుట్టపర్తి, జూలై 16 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లాలో ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, సెరికల్చర్, ఏపీసీఎన్‌ఎఫ్ శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.



జిల్లాలో అమలవుతున్న వి బి జి రాంజీ పథకంతో అనుసంధానంగా ప్రతి మండలంలో "హాఫ్ మూన్" నమూనాను అమలు చేసి వర్షపు నీటి ప్రవాహాన్ని నియంత్రిస్తూ భూగర్భ జలాల రీఛార్జ్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామాల్లో కాంటూర్ బండ్లు, ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల్లో కూడా పంటల మొలక శాతం, దిగుబడులను కాపాడేందుకు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్, పెల్లెటైజేషన్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేసి రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.జిల్లాలో పశుగ్రాస కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, ఎంపీడీఓలు సంయుక్తంగా ఒక ఎకరం లోపు భూమి కలిగిన రైతులను గుర్తించి పశుగ్రాస సాగు పెంపునకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్ సాగు విస్తీర్ణాన్ని విస్తరించాలని, రైతులకు పంటల వారీగా శాస్త్రీయ సలహాలను నిరంతరం అందించాలని కలెక్టర్ సూచించారు.రైతుల్లో అవగాహన పెంచేందుకు వ్యవసాయ శాఖ



నిర్వహిస్తున్న "మన రైతు -- మన బలం" యూట్యూబ్ ఛానల్‌ను విస్తృతంగా వినియోగించి, ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ, పశుగ్రాస నిర్వహణకు సంబంధించిన వీడియోలను గ్రామస్థాయిలో రైతులకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, సెరికల్చర్, ఏపీసీఎన్‌ఎఫ్ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను మంత్రులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, జూలై 16 అనంత సూర్య : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి రాజధాని ప్రాంతంలోని రాయపూడిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న నూతన ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను మంత్రులు, అధికారులతో కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గురువారం పరిశీలించారు. మున్సిపల్ శాఖమంత్రి పొంగూరు నారాయణ, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న నివాస సముదాయంలోని ఫ్లాట్లు, నిర్మాణ నాణ్యత, ఆధునిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించిన నాయకులు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులకు అత్యుత్తమ వసతి కల్పించాలనే లక్ష్యంతో అమరావతిలోని రాయపూడి ప్రాంతంలో 12 అంతస్తుల చొప్పున 12 భారీ టవర్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. మొత్తం 288 విశాలమైన ఫ్లాట్లు సిద్ధమవగా, ఒక్కో ఫ్లాట్ సుమారు 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించబడింది. నిర్మాణ పనులు దాదాపు పూర్తికాగా, త్వరలోనే ప్రజాప్రతినిధులకు కేటాయించే తుది ప్రక్రియను సీఆర్‌డీఏ చేపట్టనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని అన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు ప్రజాప్రతినిధులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అత్యున్నత ప్రమాణాలతో ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఈ అత్యాధునిక ఎమ్మెల్యే క్వార్టర్స్ మరో నిదర్శనమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. త్వరలోనే ఈ క్వార్టర్స్ ప్రజాప్రతినిధులకు అందుబాటులోకి రావడం ద్వారా రాజధాని పరిపాలనా వ్యవస్థ మరింత సమ-ర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## భగవాన్ దివ్య సంకల్పానికి మరో చిరస్మరణీయ మైలురాయి







- **ఎస్ఎస్ఎస్ఐహెచ్ఎల్**
- **అనంతపురం ప్రాంగణంలో నూతన మహిళా వసతి గృహ నిర్మాణానికి శ్రీకారం**
- **1,500 మంది విద్యార్థినులకు ఆధునిక వసతి సౌకర్యాలు**

అనంతపురం, జూలై 16 అనంత సూర్య: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశయాలకు అనుగుణంగా మహిళా సాధికారత, విలువలతో కూడిన విద్యాభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ అనంతపురం ప్రాంగణంలో నూతన మహిళా వసతి గృహ నిర్మాణానికి గురువారం శుభారంభం జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ వైస్ ఛాన్సలర్ డా. బి. రాఘవేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో దివంగత డా. కిషన్ గధియా కుటుంబ సభ్యులు దనేశ్ గధియా, సంజయ్ గధియా, విద్యాసంస్థ అధికారులు, అధ్యాపకులు,



సిబ్బంది, విద్యార్థినులు, విశిష్ట అతిథులు పాల్గొన్నారు. సుమారు 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దశలవారీగా నిర్మించనున్న ఈ ఆధునిక మహిళా వసతి గృహంలో దాదాపు 1,500 మంది విద్యార్థినులకు వసతి కల్పించనున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు ఆధ్యాత్మికత, క్రమశిక్షణ, మానవతా విలువలకు ప్రాధాన్యం కల్పించేలా ఈ భవనాన్ని నిర్మించనున్నారు. విలువలతో కూడిన సమగ్ర విద్యను మరింత బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు. 1968 జూలైలో మహిళా విద్యకు అంకితభావంతో ప్రారంభమైన అనంతపురం ప్రాంగణం గత ఐదు దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థినులను విద్య, వ్యక్తిత్వ వికాసం, సేవాభావం, నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్దుతూ భగవాన్ శ్రీ సత్యసాయి విద్యా దార్శనికతకు సజీవ నిదర్శనంగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విసిటింగ్ అధ్యాపకులు, పరిశోధకులు, అతిథుల కోసం ఆధునీకరించిన అతిథి గృహాన్ని కూడా ప్రారంభించారు. విద్యాసంస్థ అభివృద్ధికి ఇది మరో కీలక మౌలిక సదుపాయంగా ఉపయోగపడనుంది. నూతన మహిళా వసతి గృహ నిర్మాణం కేవలం ఒక భవన నిర్మాణం మాత్రమే కాకుండా, మహిళలను సమగ్ర విద్య ద్వారా శక్తివంతులను చేసి, సేవాస్ఫూర్తి, మానవతా విలువలు, ఉత్తమ వ్యక్తిత్వంతో కూడిన భావి పౌరులను తీర్చిదిద్దాలనే భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య సంకల్పానికి శాశ్వత ప్రతీకగా నిలవనుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## మైనార్టీ నేతపై వేధింపులు పాల్పడిన సిఐ ను వెంటనే సస్పెండ్ చేయాలి




అనంతపురం, జులై 16 అనంత సూర్య : మైనార్టీ నాయకుడిని వేధింపులకు గురిచేసి ఆత్మహత్యాయత్నానికి కారణమైన పిడుగురాళ్ల సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ కనుసన్నలలో రాష్ట్రంలోని దళితులు వెనుకబడిన వర్గాలు మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల వారికి రక్షణ కరువైందని తెలిపారు. కూటమి ప్రభుత్వ నేతల కనుసన్నలలో రాష్ట్రంలోని అన్ని వర్గాలను వేధించడమే లక్ష్యంగా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన అనేక ఘటనలు ఎందుకు నిదర్శనమన్నారు. పిడుగురాళ్ల సిఐ వెంకట్రావు తీవ్రమైన వేధింపులకు గురి చేయడంతో మనస్థాపానికి గురై పిడుగురాళ్ల కు చెందిన దరియా హుస్సేన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. 2016 లో కొనుగోలు చేసిన ఇంటికి సంబంధించి ప్రస్తుతం రేట్లు పెరగడంతో ఆ ఇంటిని తిరిగి ఇవ్వమని అప్పటి యజమానులు పోలీసుల ద్వారా అతనిపై తీవ్ర ఒత్తిడి చేశారని, ఈ అంశంపై కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు దీనిపై పోలీసుల జోక్యాన్ని తప్పు పట్టిందని తెలిపారు. దీంతో అతనిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ పోలీసులు ప్రదర్శించిన తీరుతో తీవ్ర మనస్థాపానికి, భయానికి లోనయ్యాడన్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రస్తుతం అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు పరిశీలిస్తే గోల్డ్ చైన్ చోరీ కేసులో మనుబోలు కు చెందిన ఏడుకొండలు అరెస్ట్ చేసి విచక్షణారహితంగా టార్చర్ చేయడంతో లాకప్ డెత్ అయ్యాడని తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి రాష్ట్రంలో జరుగుతున్న దళిత మైనార్టీ బడుగు బలహీన వర్గాలపై దాడులకు కూటమి ప్రభుత్వ నేతలే ప్రధాన కారణమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా నిలిచే ఏకైక వ్యక్తి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని, ఆయన అన్ని వర్గాలను తన వంతు సహాయ సహకారాలను అందించడమే కాకుండా వారి రక్షణకు పెద్ద ఎత్తున కృషి చేశారని తెలిపారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని వర్గాలను వేధింపులకు గురి చేయడం, వారిపై దాడులకు పాల్పడడం ఘటనలు పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్నాయని ఆవేదనను వ్యక్తం చేశారు. మైనార్టీలపై జరిగే దాడులకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## అమ్మవారి ఆలయం రథం నిర్మాణానికి రూ.5116 వితరణ

అనంతపురం, జూలై 16 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం రథం నిర్మాణానికి 5116 రూపాయలు వితరణ చేశారు. బోయ వీధిలోని శ్రీ కుంటెమ్మ దేవి ఆలయ నిర్వాహకులు నాగరత్నమ్మ, రాములు ఆలయానికి సేవ చేస్తూ ఉన్నారు. ట్రస్ట్ సభ్యులు కల్లమడి రవీంద్రనాథ్, రమాదేవి దంపతుల మనవరాలు చిరంజీవి ఆశ పుట్టినరోజు సందర్భంగా ఆలయం వారు అమ్మవారికి చెక్క రథము చేయడం కొరకు నగదు 5,116 రూపా-యల తోపాటు 20 రకాల నిత్యవసర వస్తువులు ఇచ్చారు. అలాగే అమ్మవారికి చీర గాజులు పసుపు కుంకుమలు ఇవ్వడం అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. దేవుడికి చేసే సేవ వల్లనే సమాజానికి శ్రేయస్సు దక్కుతుందన్నారు. పేదలకు చేసే సేవ, దేవుడికి సహాయం చేయటంతో సమానమన్నారు. సహాయం లోనే దైవత్వం ఉందని చెప్పారు. దేవుడు మనకు ఇచ్చిన కొంతలో ఏదో ఒక రూపంలో అపదలోను, అవసరంలోను ఉన్న వారికి సహాయం చేయాలని కోరారు. ప్రజలు నిత్యం సుఖశాంతులతో ఉండాలని ఆ అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఆలయ



కమిటీ సభ్యులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

* పని చేయకుండా రూ.కోట్లలో అక్రమ వసూళ్లు
* మనీ మత్తులో అధికార, పాలక, కార్మిక యంత్రాంగం
* అనారోగ్యాలతో మృత్యువాత పడుతున్న పారిశుద్ధ కార్మికులు, మూగజీవాలు
* పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో వీడిని అవినీతి 'కళ'
* నగరపాలక ప్రత్యేక అధికారి ఐఏఎస్‌పైనే ఆశలు

# అమ్మో బయో భయం




మేడా నర్సింగ్ హోం వద్ద డస్ట్ బిన్‌లో..


సాయినగర్ ఫస్ట్ క్రాస్‌లో డస్ట్ బిన్‌లో మెడికల్ వేస్ట్ వేస్తున్న ఆసుపత్రి సిబ్బంది


వరుణ్ ఆసుపత్రి వద్ద మెడికల్ వేస్ట్ వేసుకుని వెళ్తున్న మునిసిపల్ చెత్త వాహనం

***అనంతపురం, జూలై 16 మనంన్యూస్ :***

అప్పట్లో చరిత్ర గొప్పగా చెప్పుకునేది అశోకుడు రోడ్డుకు ఇరువైపులా చెట్లు నటించమని.. మరి ఇప్పట్లో ఓ అశోకుడు బయో వ్యర్థాలతో జిల్లాలకు జిల్లాలనే ప్రమాదంలో పడేస్తున్నాడట. నిబంధనల మేరకు ఈయన చేయాల్సిన పని చేయకుండానే తన వైపు పాలకులు, అధికారులు, కార్మిక సంఘం నాయకులు ఉన్నారనే అహంతో పారిశుద్ధ్య కార్మికులను, ఆఖరికి మూగజీవాల ప్రాణాలతో కూడా చెలగాట మాడుతున్నాడని తెలిసింది. ఇతని అక్రమ వసూళ్ల దందా, ప్రజల ప్రాణాలతో ఆడుతున్న చెలగాటం.. అంతా తెలిసిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని ఓ కీలకమైన ఓ అధికారిణిలో మాత్రం ఎలాంటి చలనం లేకుండా అవినీతిలో మాత్రం 'కళ' ఒట్టిపడేలా విధి నిర్వహణ చేస్తుందని తెలుస్తోంది. అయితే జిల్లా ఐఏఎస్ అధికారులు, ప్రత్యేక అధికారులుగా పని చేస్తున్న ప్రదేశాల్లో కూడా **'అమ్మో బయో భయం'**గా ప్రజలు జీవించాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటే చాలా చిన్న విషయం కాదు. అసలు ఏంది ఈ బయో అన్నది ఓసారి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. **అనంత సూర్య తెలుగు దినపత్రిక** ఇదే విషయాన్ని బయో మెడికల్ వ్యర్థాలతో జరుగుతున్న ప్రమాదాన్ని కూడా సూచన ప్రాయంగానే ఓ కథనం రూపంలో జూలై 2వ తేదీన **'శ్రీవెన్‌తో కాసుల కమిట్మెంట్'** అంటూ ఒక కథనాన్ని ప్రచురించాం. అయితే ఇందులో ఎవరెవరికో నెల నెల భారీ స్థాయిలో వాటాలు ఉన్నాయన్న విషయం తాజాగా వెలుగులోకి వస్తుంది. ఆ వివరాలను ఒక్కసారి పరిశీలిస్తే..

ఒక అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోనే బయో మెడికల్ వ్యర్థాలను సేకరించి ప్రజలకు, అన్ని వర్గాలకు ఆఖరికి మూగజీవాలకు కూడా ఎలాంటి హాని లేకుండా దూరంగా తరలించి కనిపించకుండా చేయాల్సిన గురుతర బాధ్యత ఓ ఏజెన్సీపై ఉంది. అందుకు గాను ఒక అనంత నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ల్యాబులు, ఆసుపత్రులు నెల నెల డబ్బు చెల్లించడమే కాకుండా ఒక సంవత్సరం అడ్వాన్స్ కూడా ముందుగానే ఇవ్వాల్సి ఉంటుంది. ఆ లెక్కన ఒక నగరపాలక సంస్థ పరిధిలోనే దాదాపు 8 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే చేయాల్సిన పని చేయకుండా ఎక్కడికక్కడ బయో మెడికల్ వేస్ట్‌ను నగరపాలక చెత్త ట్రాక్టర్లలో వేసి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తూ ఉండడం విశేషం. అందుకు సంబంధించిన చిత్రాలతో కూడిన ఆధారాలను కూడా ఈ కథనం వెంట జత చేస్తూ ఉన్నాం. ఆ లెక్కన ఆ సంస్థ.. అదే అదే **'శ్రీవెన్'** సంస్థ మూడు ఉమ్మడి జిల్లాలకు కలుపుకొని రూ.కోట్లలోనే వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ వసూలైన మొత్తాల నుండి పలువురు పాలకులకు, ముఖ్య అధికారులకు, ఆఖరికి కార్మిక సంఘం నాయకులకు కూడా అందునుండి వాటాలు అందుతున్నాయని, అందువల్లే వారు సైతం మౌనంగా ఉన్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్ సంస్థ అనంతపురం, కడప, శ్రీ సత్యసాయి అనే మూడు జిల్లాల్లోని ఆసుపత్రులు, ల్యాబ్‌ల నుంచి అడ్వాన్స్‌గా రూ.లక్షల్లో డబ్బు తీసుకొని, ప్రతి నెలా ఫీజు వసూలు చేస్తూ అది కూడా ఇతర జిల్లాల కన్నా రెట్టింపు. ఇక్కడ మరో విషయం సేకరించకుండానే ఎక్కడికక్కడ చెత్త ట్రాక్టర్లలో మున్సిపాలిటీ దాంట్లో వేస్తూ **మమ** అనిపించుకుంటున్నారని తెలిసింది. అనంతపురం, మూడు జిల్లాల్లోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు ఈ సంస్థకు ప్రతి నెలా వేల రూపాయలు చెల్లిస్తున్నాయి. అయినా సరే రోజూ సేకరించాల్సిన ఇంజక్షన్లు, సూదులు, బ్లడ్ బ్యాగులు, ఇతర ప్రమాదకర వ్యర్థాలను సకాలంలో తీసుకెళ్లడం లేదు. దీంతో ఆసుపత్రుల వారు నిస్సహాయంగా ఆ వ్యర్థాలను మామూలుగా మున్సిపల్ చెత్తలో కలిపి పారేస్తున్నారు. ఫలితంగా పారిశుద్ధ్య కార్మికులు చెత్త ఏరుతూ ఉపయోగించిన సూదులు గుచ్చుకొని హెచ్ఐవి, హెపటైటిస్–బి వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలువురు కార్మికులు గాయపడినట్లు సమాచారం.

**నిబంధనలను గాలికి వదిలిన సంస్థ :**

జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2016 ప్రకారం డబ్బు తీసుకున్న సంస్థ ప్రతిరోజూ వ్యర్థాలను సేకరించి శాస్త్రీయంగా నాశనం చేయాలి. కానీ ఈ సంస్థ కేవలం డబ్బు వసూలుకే పరిమితమై ప్రజారోగ్యంతో చెలగాటమాడుతోంది. ఇది ఐపీసీ సెక్షన్ 269, 270.. పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద నేరం.

**కలెక్టర్.. జోక్యం చేసుకోవాలి :**

ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్న ఈ సంస్థపై జిల్లా కలెక్టర్ వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపి, లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, కొన్ని పారిశుద్ధ్య కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. డబ్బు తీసుకొని సేవ చేయని ఇలాంటి సంస్థల వల్ల సమాజానికి, పర్యావరణానికి పెను ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


డస్ట్‌బిన్ వద్ద మెడికల్ వ్యర్థాలు ఉన్న దృశ్యం

# డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల నమోదు వారోత్సవాలు

* జూలై 20 నుంచి 25 వరకు ప్రత్యేక నమోదు
* రైతులు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, జూలై 16 అనంత సూర్య; ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి పారుదల ప్రాజెక్టు ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్ సూక్ష్మ నీటి పారుదల పరికరాలను 100 శాతం లేదా 90 శాతం రాయితీపై అందించేందుకు ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు.జూలై 20 నుంచి 25వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 386 రైతు సేవా కేంద్రాల (ఆర్‌బీకేలు) ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు.అర్హులైన రైతులు తమ ఆధార్ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశిత గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కోరారు.



# అనుమతులు లేని రెండు ఇసుక టిప్పర్లు సీజ్



ముదిగుబ్బ, జూలై 16 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ అధికారులు గురువారం ముదిగుబ్బ- పుట్టపర్తి రహదారిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సరైన రవాణా అనుమతులు, బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను గుర్తించి సీజ్ చేశారు.తనిఖీల్లో మైనింగ్ శాఖ సహాయ సంచాలకులు షేక్ అమీర్ బాషా, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఖాజావలి తదితర సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# జాప్ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా సీపీ వేణుగోపాల్ రెడ్డి

అనంతపురం, జూలై 16 అనంత సూర్య: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్, ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జిల్లా బ్యూరో ఇన్‌ఛార్జ్ సీపీ వేణుగోపాల్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాప్ రాష్ట్ర అధ్యక్షుడు పున్నంరాజు, ప్రధాన కార్యదర్శి యుగంధర్ రెడ్డి గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. 2001లో ప్రజాశక్తి దినపత్రికతో జర్నలిజం ప్రస్థానం ప్రారంభించిన వేణుగోపాల్ రెడ్డి, సూర్య, స్టూడియో ఎన్, ఆంధ్రభూమి, విశాలాంధ్ర వంటి ప్రముఖ మీడియా సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం 2019 నుంచి ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జిల్లా బ్యూరో ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్నారు.గతంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగానూ సేవలందించారు.ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాప్ రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం జిల్లాలో జాప్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు పాత్రికేయుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, జర్నలిస్టుల సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.




# వైభవంగా సాయి జగన్నాథ రథోత్సవం

* రథాన్ని లాగిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ

పుట్టపర్తి, జూలై 16 అనంత సూర్య: పుట్టపర్తిలో సాయి జగన్నాథ రథోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. సాయి సంకీర్తనలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, వేలాది మంది భక్తులు రథోత్సవం లో పాల్గొన్నారు . ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి జగన్నాథ స్వామి రథాన్ని భక్తులతో కలిసి లాగారు. అనంతరం పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, పుట్టపర్తి ప్రపంచానికి ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తున్న పవిత్రక్షేత్రమని, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవ, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.రథోత్సవంలో పట్టణ ప్రముఖులు, సేవాదళ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల సమస్యలపై పరిశీలన. రథోత్సవానికి ముందు బ్రాహ్మణపల్లి పొలాలకు వెళ్లే రహదారి సౌకర్యం కల్పించాలని రైతులు కోరడంతో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, సంబంధిత శాఖల అధికారులు కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రాహ్మణపల్లి రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకు ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏనుములపల్లి రైతులు, మహిళలు పాల్గొన్నారు.





# సర్ ప్రక్రియలో అర్హులైన ఒక్కరి ఓటు కూడా తొలగిపోకుండా చూడాలి

ధర్మవరం, జూలై 16 అనంత సూర్య:స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా పార్టీ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్ సూచించారు.ధర్మవరంలోని ఎర్రగుంట సర్కిల్‌లోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 రోజులుగా ఎస్ఐఆర్ కార్యక్రమంలో కృషి చేసిన పార్టీ శ్రేణులను అభినందించారు. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లు, పేర్లలో తప్పులు ఉన్న అనామలీస్ ఓటర్ల వివరాలను గుర్తించి, అవసరమైన ధ్రువపత్రాలను ఈ నెల 30లోపు బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు.



త్వరలో ప్రారంభమయ్యే పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.అనంతరం ధర్మవరం పట్టణంలోని సిద్ధయ్యగుట్టకు చెందిన టీడీపీ కార్యకర్త ఎర్రగుడి ధనుంజయ ప్రమాదవశాత్తు మరణించడంతో, పార్టీ సభ్యత్వ బీమా పథకం కింద ఆయన భార్య ఎర్రగుడి దుర్గమ్మకు రూ.5 లక్షల బీమా చెక్కును పరిటాల శ్రీరామ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధర్మవరం నియోజకవర్గంలో సుమారు 72 వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, ప్రమాదవశాత్తు మరణించిన సభ్యుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందించడం టీడీపీ ప్రత్యేకత అని పేర్కొన్నారు. చెక్కు అందుకున్న దుర్గమ్మ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత



రామగిరి, జూలై 16 అనంత సూర్య: రామగిరి మండలం పేరూరు ప్రాజెక్టు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఆసుపత్రిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు సమయపాలన పాటించి రోగులకు మర్యాదపూర్వకంగా సేవలందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా ఇతర ఆసుపత్రులకు రోగులను రెఫర్ చేయకుండా స్థానికంగానే మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది ఫార్మసీ నిర్వహణకు ప్రత్యేక గది, అదనపు పడకలు, తాగునీటి సౌకర్యం వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.అనంతరం కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన పార్టీ శ్రేయోభిలాషి పెద్ద వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.తదుపరి వెంకటాపురంలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405